# విశ్వాస పాత్రుడు

రచన : ''శ్రీ''

'ఒరేయ్ వెంకాయ్!' అన్న పిలుపు వినబడేసరికి వెంకన్న వుల్లిక్కిపడ్డాడు. అంతవరకూ పనిమనిషి సీతతో పరాచికాలాడ్తూ వున్నాడు. యజమాని పిల్చేసరికి తానక్కడ సిద్ధంగా ఉండకపోయాడా? యింక ఉరుములకు పిడుగులకూ లోటుండదు.

జానకిరామయ్య కంఠం అటువంటిది. కోపంవస్తే ఆయన మనిషికాడు. ఆ భయంవల్ల వెంకన్న పరుగున బోయి యజమాని దగ్గిర చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

'ఏఁరా, వెంకాయ్! యింతవరకూ ఏంచేస్తున్నావ్?'

'ఏమీ చెయ్యలేదండి. సీత ఒస్తే అమ్మగారు చెప్పిన పని దానికి పురమాయిస్తున్నాను. ఇంతలో మీరు పిలిచారు.'

జానకిరామయ్య వెంకన్నను బజారుకి వెళ్ళమన్నాడు

'చిత్తం' అంటూ వెంకన్న అక్కణ్ణుంచి కదిలాడు.

వెంకన్న యింక, జానకిరామయ్యగారి వీధి గుమ్మం దాటి రోడ్డుమీద కొస్తాడనగా ఆ గుమ్మం దగ్గరే ఓ పెద్ద కవరు సీలువేసివున్నది కన్పించింది వెంకన్నకి.

వెంకన్న అలస్యం చెయ్యక దాన్ని తీసుకొని మడిచి బొడ్డుక్రింద దాచిపెట్టాడు. గబగబా బజారుకి పోయాడు. బజారు సందడిగావుంది. ఎటుచూసినా అలికిడే! కాని వెంకన్నకి మనస్సు సమంగాలేదు. ఆ కవర్లో యేముంది? చూసేవరకు అతని మనస్సుండ బట్టలేదు. వెంటనే తన యింటికిపోయి తలుపులు బిడాయించి లోపలకూర్చొని కవరు విప్పతుండగ చేతులు వణికాయి. గుండె దడదడ మంటూ కొట్టుకోవడం ప్రారంభించింది.

ఎలాగైతేనేం కవరు విప్పబడింది. అందులో యేముందా అనుకొంటూ వెంకన్న చూశాడు. ఆశ్చర్యం! అందులో రూపాయినోట్లు కన్పించాయి. బైటకుతీసి లెక్కపెట్టేడు. వెయ్యిరూపాయలు ఓ వుత్తరంవుంది.

ఆ డబ్బు చూడగానే వెంకన్న మనస్సులో అనేక ఆశలు మొలకెత్తాయి.

ఎన్నిరోజులు కష్టపడి పనిచేసినా యింతడబ్బు రావడం కష్టం. ఓ మూడొందలుపెట్టి యేదైనా వ్యాపారంచేసుకొని తక్కిన డబ్బుని నిల్వచేసుకొని హాయిగా బ్రతకొచ్చు.

'ఛీ! స్వామి ద్రోహం తలపెడ్తావా? నీకది శ్రేయస్కరంకాదు. నిన్ను, నీ యజమాని యెంతగా ప్రేమిస్తున్నాడు! నీయందే విశ్వాసం వుంచాడు. అటువంటి వాణ్ని నమ్మించి గొంతుకకోస్తావా! ఈ డబ్బుపట్టుకెళ్ళి నీ యజమానికిచ్చేయ్! ఇదాతని సొమ్మే! పరులసొమ్ము కాశపడొద్దు!'

'ఓరి వెఱ్ఱినాగమ్మా! సిరిరా మోకాలొడ్డి నీ సౌఖ్యాన్ని చేతులారా జారవిడిచేసుకుంటావా? నా మాటవిను. ఈ అవకాశాన్ని వదులుకొంటె యిటువంటి ఛాన్సు నీకు జన్మలో కలుగబోదు. నామాటవిను. యీ డబ్బును భద్రంగా పెట్టెలో అట్టేపెట్టి నీ యజమాని దగ్గరకుపో రెండు రోజులుండి నమ్మకం కల్గేక ఆ వుద్యోగానికో దండంపెట్టి వేరేవ్యాపారం చేసుకొని సుఖంగ బ్రతుకు' అంటూ ఆశ హెచ్చరించింది వెంకన్నను.

అతడు వెంటనే లేచి పెట్టెదగ్గరకు పోతున్నాడు వాటిని దాచిపెట్టడానికి కాని అతడు భయపడ్తూనే వున్నాడు.

'ఎటు రాపోతున్నావ్? ద్రోహీ. ఆ డబ్బుంచుకొని యెన్నాళ్ళు బతుకుదామనుకుంటున్నావ్! నిజాయితిగా సంపాదించలేని డబ్బు యెన్నాళ్ళవుంటుందిరా, అవివేకి! ఆ డబ్బు నీదగ్గిరే అట్టి పెట్టుకుని వుంచావా, రహస్యం దాగదు. పోలీసులు అందరూ వస్తారు. నిన్ను దొంగకింద జమకడ్తారు. నువ్వు దొరికిందని యెంత చెప్పినా వినుకోరు. ఖైదులోపెట్టేస్తారు. దాంతోసరా! సంఘంలో అదిమొదలుకొని నిన్న దరూ చీడపురుగుని చూసినట్లు చూస్తారు. చిన్నపిల్లలు సహితం నీ ముఖం మీద వుమ్మేస్తారు. 'ఊఁ! అలా గుడ్లు మిటకరించి చూస్తావేం? ఆ డబ్బు పట్టుకొని పరుగునపోయి నీ యజమానికిచ్చేయ్! ఊఁ పోవవేం? అంటూ కర్తవ్యం తొందరపెట్ట సాగింది.

వెంకన్న డబ్బువైపు చూశాడు. అవన్నీ సరిక్రొత్త నోట్లు. ఓహ్! ఎన్నిన్నాయ్! తికమకపడ్డాడు.

కాని ఓ నిశ్చయానికొచ్చేడు. డబ్బు వుత్తరం కవర్లో భద్రంగ పెట్టి జానకిరామయ్య యింటికి పరుగున పోయాడు.

'నాన్నా! నాన్నోయ్! కొంపమునిగింది!' అంటూ రఘు రొప్పుతూ రోజుతూ తండ్రి గదిలోనికి వచ్చేడు.

జానకిరామయ్య హఠాత్తుగ కుర్చీమీద నుండిలేచి 'ఎవరి కొంపరా? త్వరగా చెప్పూ!'

'ఎవరికొంపో ఐతే, నాకెందుకూ? మనకొంపే నాన్నా?'

'ఎలా మునిగిందిరా? మళ్ళీ గోదావరి వరదలొచ్చాయాయేం?'

'అదేంకాదు నాన్నా! పోయింది. అది పోయింది నాన్నా!'

'నీబొంద! ఏమిట్రా అదీ! ఆ యేడ్చేదేదో సమంగ చెప్పి ఏడ్వరాదూ? ఇంత అమోఘమైన తెలివి తేటలున్నాయి కాబట్టే ధర్డుఫారంలో రెండుసార్లు డింకీ కొట్టేవ్! అయిపోయిందేమిటో వివరంగా చెప్పు!' అంటూ జానకిరామయ్య కొడుకువైపు తీక్ష్ణంగ చూసేసరికి రఘు బావురుమంటూ యేడ్చేడు.

'అదేనో చెప్పకుండానే యేడుస్తావేమిట్రా, చవటదద్దమ్మా!'

'నువ్వు పోస్టులో వేయమన్న కవరు యెక్కడో పారేసాను నాన్నా!'

రఘు యేడుస్తూనే చెప్పి భయంతో వొణికిపోతూ తండ్రివైపు చూసేడు. జానకిరామయ్య కోపావేశంతో పీపబెత్తంతీసి రఘుదగ్గర కొచ్చేడు. 'ఔరా నీకెన్నిసార్లు చెప్పాను! ఒళ్ళు దగ్గరపెట్టుకొని వుండమన్నానా అంతపరకా నల్లమందు ఖాయిలాగ! వందా రెండొందలా? అచ్చం వెయ్యిరూపాయలు! ఎంత చెమటోడ్చి సంపాదించాను! ఊ! యెక్కడ పారేసావో చెప్పు!' అంటూ ఆబెత్తం యెత్తి కొట్టబోయేసరికి 'అగండి బాబూ! మీ కవరు దొరికింది' అంటూ వెంకన్న పరుగునవచ్చి దాన్ని యజమాని చేతికిచ్చాడు. జానకిరామయ్య ఆతృతగా దాన్నందుకొని రూపాయలు లెక్కపెట్టేడు సమంగ వెయ్యి రూపాయలూ వున్నాయ్! అతడి ముఖం ఆనందంతో విప్పారింది. రఘుయేడ్పు యెక్కడికి పోయిందోగాని పోయింది. సంతోషంగ ఊపిరిపీల్చేడు.

'వెంకన్నా! డబ్బుకాశించక జాగ్రత్తగా తెచ్చి అప్పగించావ్! నీవంటి విశ్వాస పాత్రుడైన సేవకుడుంటే యజమాని హాయిగ బ్రతకొచ్చు. నీ న్యాయానికి బహుమతి ఇదిగో' అంటూ వందరూపాయల నోటొకటి తీసి వెంకన్నకు యిచ్చాడు.

వెంకన్న సంతోషంతో దాన్నందుకొని భక్తితో రామయ్యగార్కి నమస్కరించి సీతి దగ్గరకు పరుగున బోయాడు, నవ్వుముకంతో దానికీ విషయం చెప్పడానికి!

ఎల్లప్పుడు

మేలైన తిరుపూరు గణేశ్ నిట్టింగ్ కంపెనీ బనీన్లనే వాడండి.॥




నాణ్యతకు, శుభ్రతకు, చిరకాలపు శ్రేష్టతకు పేరొందినది.

ఇండియాలో తయారైనది.

శ్రీ గణేశ్ నిట్టింగ్ కంపెనీ

పోస్టుబాక్సు నెం. 48, తిరుపూరు.